

నియోజకవర్గాల్లో స్కిల్ హబ్స్

పార్వతీపురం టౌన్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): శాసన సభ నియోజకవర్గ పరిధిలో స్కిల్ హబ్స్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సాయికృష్ణచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటి ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం ఈ 91772 97528, 73825 59022, 79937 95796, 63034 93720 నెంబర్లకు ఫోన్ చేయా లని సూచించారు. ఆసక్తి కలిగిన జిల్లా యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జై శ్రీరామ్



శ్రీరామ పాదుకారాధనకు వేలాదిగా హాజరైన భక్తులు



మాట్లాడుతున్న త్రిదండి చినజీయర్‌స్వామి

8లో

బొబ్బిలి రాజాకళాశాల మైదానంలో శ్రీరామ పాదుకారాధన శుక్రవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వికాస తరంగణి, ఎమ్మెల్యే బేబీనాయన సంయుక్తంగా ఈ కార్యక్రమం తలపెట్టారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త త్రిదండి చినజీయర్‌స్వామి స్వయంగా వేదమంత్రోచ్చారణ చేస్తూ భక్తులతో పాదుకారాధన చేయించారు. భక్తులంతా పరవశించిపోయారు.

నేడు జిల్లాకు పౌర సరఫరాల శాఖ మంత్రి

- ఏర్పాట్లలో అధికారులు, కూటమి శ్రేణులు
- సమస్యలు తెలియజేసేందుకు రైస్ మిల్లర్లు సమాయత్తం

పార్వతీపురం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం జిల్లాకు రానున్నారు. పార్వతీపురం మండలం నర్సిపురం పాఠశాలలో నిర్వహించే పేరెంట్స్ సమావేశంలో ఆయన పాల్గొనున్నారు. అనంతరం పెదబొండపల్లిలో జరిగే సమావేశానికి హాజరు కానున్నారు. సీతానగరం మండలం లచ్చయ్యపేట వద్ద ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు మంత్రికి ఘనంగా పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మంత్రిపైనే కోటి ఆశలు

జిల్లాకు తొలిసారిగా వస్తున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌పై రైస్ మిల్లర్లు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు సమాయత్త మవుతున్నారు. ప్రధానంగా సబ్సిడీతో కూడిన రుణాలు, గత ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లుల బకాయిలు చెల్లించాలని కోరనున్నట్లు తెలిసింది. వాస్తవంగా గత వైసీపీ సర్కారు జిల్లాలో రైస్‌మిల్లర్లకు బకాయిలను చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో ఆ ప్రభావం ప్రస్తుతం బ్యాంకు గ్యారెంటీ (బీజీ)లపై పడింది. మరోవైపు ధాన్యం సేకరణ ఆలస్యమవుతున్న తరుణంలో తరచూ మిల్లర్లతో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జేసీ శోభిక సమావేశాలు నిర్వహిస్తున్నారు. మిల్లర్లు బీజీలు ఇచ్చే విధంగా ఒప్పించి ధాన్యం కొనుగోలును వేగవంతం చేస్తున్నారు. అయితే ఈ సమస్యలపై మంత్రి ఏ విధంగా స్పందిస్తారన్నది వేచి చూడాల్సి ఉంది.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం/పాలకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం పాలకొండ నియోజకవర్గం కొండాపురంలో రెవెన్యూ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో భూదందాలు జరిగాయన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసేందుకు కూడా అప్పట్లో బాధితులు భయపడే వారని తెలిపారు. రైతులకు చెందిన పాస్ పుస్తకాలపై అప్పటి సీఎం జగన్ ఫొటో ముద్రించుకుని దారుణమైన తప్పిదం చేశారని ఆరోపించారు. సర్వే రాళ్లపై కూడా జగన్ ఫొటో కనిపించే విధంగా చేశారని ఇందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని తెలిపారు. 'మీ భూమి..మీ హక్కు' అనే నినాదంతో ఈ నెల 6 నుంచి వచ్చే ఏడాది జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు తమ సమస్యలను నేరుగా సదస్సు దృష్టికి తీసుకురావొచ్చన్నారు. ఇకపై అన్నదాతలకు ప్రభుత్వ లోగోతో పాస్ పుస్తకాలు జారీ చేస్తామని తెలిపారు. డీ పట్టా సమస్యలు వివాదాలకు ప్రధానమైన వని.. వీటిని పరిష్కరించడంలో అధి కారులు శ్రద్ధ వహించాలన్నారు. సదస్సులు, కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదులపై దృష్టిసారించాలని సూచించారు. ధాన్యం సేకరణ జరిగిన 48 గంటల్లో డబ్బులు చెల్లించాలని తెలిపారు. కూర్మసాగరం, జంపరకోట ప్రాజెక్టులను పూర్తి చేస్తామని.. ఇది రైతు ప్రభుత్వమని వెల్లడించారు. శనివారం నిర్వహించనున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌కు తల్లిదండ్రులు హాజరుకావాలన్నారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రూ.20 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో తోటపల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాల్సి ఉందని, డంపింగ్‌యార్డుతో పాటు మరికొన్ని సమస్యలను పరిష్కరించాల్సి ఉందని చెప్పారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో భూ సమస్యలపై దాదాపు 50 నుంచి 60 శాతం ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. పారిశుద్ధ్యంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా నిలపాలని ప్రజలకు సూచించారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లు అందించారు.

మొదటి రోజు.. 462 ఫిర్యాదులు

జిల్లాలో మొదటి రోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 503 మంది నుంచి 462 ఫిర్యాదులు అందాయి. 22ఏకు నాలుగు, వెబ్‌ల్యాండ్ కరెక్షన్ కోసం 72, మ్యుటేషన్ 282 , ఇతర సమస్యలకు సంబంధించి 104 అర్జీలను అధికారులు స్వీకరించారు.

డోలీ మోతలు ఉండకూడదు

సీతంపేట రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో డోలీ మోతలు ఉండకూడదని మంత్రి సంధ్యారాణి తెలిపారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని సెక్టోరియల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. .నిధులకు డోకా లేదని మారుమూల గిరిజన గ్రామాల్లో పక్కా రహదారులు నిర్మించాలని సూచించారు. విద్య, వైద్యం, సాగు, తాగునీరుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. త్వరలో అంబులెన్స్, ఫీడర్ అంబులెన్స్ వాహనా లను ఐటీడీఏకు కేటాయిస్తామని తెలిపారు. వీడీవీకేలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను మంత్రి అభినందించారు. గిరిజన విద్యార్థులను అధికారులు, పాఠశాలల వార్డెన్, ఉపాధ్యా యులు సొంత బిడ్డల్లా చూడాలన్నారు. మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశిం చారు. పాఠశాలలపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, ఫిర్యాదుల బాక్స్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

మిగిలిన చోట్ల..

సీతానగరం మండలం రేపటివలసలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, గుమ్మలక్ష్మీపురం మండలం మొలిగూడ గ్రామంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. జిల్లాలో మిగిలిన చోట్ల జరిగిన సదస్సుల్లో జేసీ శోభిక, డీఆర్వో హేమలత, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రైవేట్ పాఠశాల బస్సు బోల్తా

- క్లీనర్ మృతి
- ముగ్గురు విద్యార్థులకు గాయాలు



బోల్తా పడిన ప్రైవేట్ పాఠశాల బస్సు

బెలగాం/ పార్వతీపురం రూరల్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామ సమీపంలో శుక్రవారం ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో క్లీనర్ మృతి చెందాడు. ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు, విద్యార్థుల కథనం ప్రకారం... పాఠశాల ముగిసిన తర్వాత సాయంత్రం 5 గంటల సమయంలో సుమారు 25 మంది విద్యార్థులతో ఒక ప్రైవేట్ పాఠశాల బస్సు పార్వతీపురం నుంచి బాలగుడబ వైపు బయల్దేరింది. అయితే కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఆ గ్రామ సమీపంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో బస్సు బోల్తా పడింది. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వారి ఆర్తనాదాలు విని స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. బస్సులో ఉన్న విద్యార్థులకు బయటకు తీశారు. అయితే ఈ ఘటనలో బస్సు కింద పడి అదే గ్రామానికి చెందిన క్లీనర్ పెంకి మురళి(26) అక్కడికక్కడే మృతి చెందాడు. రెండో తరగతి చదువుతున్న సుస్మితకు తీవ్ర గాయాలయ్యాయి. ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రవళ్లిక, ఐదో తరగతి చదువుతున్న ఓంకారకు స్వల్ప గాయాలయ్యాయి. వారిలో సుస్మితను ప్రైవేట్ ఆసుపత్రికి, మిగతా ఇద్దరిని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకుని రూరల్ ఎస్ఐ సంతోషికుమారి వివరాలు సేకరించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నన్నట్లు తెలిపారు.

విద్యార్థులను కాపాడి..




మురళి(ఫైల్)

బస్సు డోర్ వద్ద ఉన్న క్లీనర్ మురళి వాహనం బోల్తా పడిన సమయంలో రెండు చేతులు చాచి విద్యార్థులకు రక్షణగా నిలిచిడు. వారు పడి పోకుండా కాపాడాడు. అయితే బస్సు కింద పడిపోయిన మురళి అక్కడి కక్కడే మృతి చెందినట్లు విద్యార్థులు తెలిపారు. మృతిడికి తల్లిదం డ్రులు ఒక సోదరుడు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న కుమారుడిని కోల్పోడంతో వారు భోరున విలపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతి చెందిన క్లీనర్ కుటుంబానికి ప్రభుత్వం తరపున న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రమాదం జరిగిన తీరుపై రూరల్ పోలీసులు సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశించారు.

14న నీటి సంఘాల ఎన్నికలు

- రీ షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- సమాయత్తమవుతున్న అధికారులు



8లో

వారి సేవలు అనిర్వచనీయం

- హోంగార్డుల దినోత్సవంలో ఎస్పీ మాధవరెడ్డి
- ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేత



8లో

సైబర్ వలలో విలవిల



- కలవరపరుస్తున్న సైబర్ నేరాలు
- కొత్త పంథాలో మోసాలు
- ఆధునిక సాంకేతిక సాయంతో రెచ్చిపోతున్న కేటుగాళ్లు
- ఉమ్మడి జిల్లాలో రెండేళ్లలో రూ. 23.01 కోట్లు దోపిడీ
- లబోదిబోమంటున్న బాధితులు

జియ్యమ్మవలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)

- 'హలో... మేము సీఎం కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. మీరు చేసిన ఓ మంచి పనికి రూ.50 వేలు బహుమతిగా పంపించాలను కుంటున్నాం. మీ ఫోన్‌పే నెంబరు ఇవ్వండి. మీ ఫోన్ నెంబరుకు వచ్చిన ఓటీపీ చెపితే మీ ఖాతాలో డబ్బులు పడతాయి' అని ఇటీవల ఉమ్మడి జిల్లాలో ఓ వ్యక్తికి కాల్ వచ్చింది. అది నమ్మి ఓటీపీ చెబితే.. ఆయన ఖాతాలో డబ్బులన్నీ మాయమయ్యాయి.
- భోగాపురం మండలం లింగాలవలసకు చెందిన ఓ వ్యక్తి ఓ మనీ యాప్ వలలో పడి సుమారు రూ.9లక్షలు పోగొట్టుకున్నాడు.
- డ్రగ్స్ పార్సిల్ వచ్చిందని విజయనగరానికి చెందిన ఓ రిటైర్డ్ అధ్యాపకురాలకు ఓ ఫోన్ వచ్చింది. డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని బెదిరించి.. ఆమె అకౌంట్ నుంచి రూ.40 లక్షలను కాజేశారు. విషయాన్ని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడంతో రూ.20 లక్షలు రికవరీ చేశారు.
- ముంబై సీబీఐ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నామని బొబ్బిలి పట్టణంలో ఓ ఉపాధ్యాయుడికి ఇటీవల ఫోన్ వచ్చింది. విదేశాల్లో ఉన్న మీ కుమారుడు హవాలా ద్వారా నగదు బదిలీ చేస్తున్నాడని తక్షణమే రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఆయన పోలీసులకు తెలియజేస్తామని చెప్పడంతో వారు మరి ఫోన్ చేయలేదు.

... ఇలా ఉమ్మడి జిల్లాలో ఎంతోమంది సైబర్ మోసాలకు గురవుతున్నారు. సైబర్ కేటుగాళ్ల వలలో పడి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఆధునిక సాంకేతికత సాయంతో ఈ నేరగాళ్లు బరి తెగిస్తున్నారు. కొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ప్రజల అత్యాశ, అమాయకత్వం ఆసరాగా చేసుకుని దోచేస్తున్నారు. బాధితులకు అనుమానం రాకుండా ఫోన్లలో బెదిరిస్తూ.. రూ.లక్షలు కాజేస్తున్నారు. ఏసీబీ, ఉన్నధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీ ఫొటోలను డీపీలుగా పెట్టి బాధితులకు అనుమానం రాకుండా వ్యవహరిస్తున్నారు. ఆ తర్వాత డ్రగ్స్, వీడియోలు, నల్లధనం, హవాలా తదితర అంశాల్లో కేసులు నమోదయ్యాయనో బెదిరించి.. తక్కువ పెట్టుబడికి అధిక లాభం ఇస్తామనో ఆశ చూపించి అందిన కాడికి దోచుకుంటున్నారు. దీంతో సామాన్యులే కాదు.. ఉద్యోగులు, యువత, వివిధ వర్గాల వారు బాధితులుగా మారుతున్నారు. ఇంటర్నెట్‌పై అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత వంటి అంశాల వల్ల ప్రజలు వారి ఉచ్చులో పడిపోతున్నారు. తరువాత అటు కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక, ఇటు పోలీస్ యంత్రాంగానికి ఫిర్యాదు చేస్తే ఏమవుతుందోనన్న ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. గత రెండేళ్లలో ఉమ్మడి జిల్లా పరిధిలో రూ. 23.01 కోట్లు సైబర్ నేరగాళ్ల జేబుల్లోకి వెళ్లాయని గణాంకాలు చెబుతున్నాయి. దీంతో పోలీసులు ఈ తరహా నేరాలపై దృష్టి సారిస్తున్నా.. సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతూనే ఉన్నారు.

సైబర్ ఆర్మీ పేరిట శిక్షణ


విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి సైబర్ నేరాల అడ్డుకట్టకు మరో ముందడుగు వేశారు. సాయి తెలుగు సైబర్ ఆర్మీ పేరిట శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసి వారికి ట్రైనింగ్ ఇస్తున్నారు. సైబర్ నేరాల విషయంలో తీసుకోవాల్సిన మెళకువలు నేర్పిస్తున్నారు. అధునాతన సైబర్ నేర నిరోధక పరికరాలు కొనుగోలు చేసి తన పరిధిలో ఉన్న సిబ్బంది అందరితో వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్‌లో ఏ విధమైన ఫ్రాడ్ జరుగుతున్నాయనే వాటిపై వాటిని పట్టుకునే పరికరాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఇలా చేయాలి..

- వాట్సాప్, టెలిగ్రాం గ్రూపుల్లో ఏపీకే యాప్ ఫైల్స్‌లో వచ్చిన లింక్‌లు క్లిక్ చేయరాదు.



- అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్‌లు వచ్చినా, రకరకాలుగా బెదిరింపు కాల్స్ వచ్చినా.. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు గాని, డయల్ 1930 నెంబర్‌ను గాని సంప్రదించాలి.
- ఆధార్‌కార్డు గడువు ఎప్పుడూ ముగియదు. ఒకవేళ వ్యక్తిగత వివరాలు మార్చాల నుకుంటే ఆధార్ సెంటర్లకు వెళ్తే సరిపోతుంది.
- కరెంటు బిల్లులు



(మిగతా 10వ పేజీలో...)



కార్యక్రమంలో వేలాదిగా పాల్గొన్న భక్తజనం

కన్నుల పండువగా శ్రీరామ పాదుకారాధన

● బొబ్బిలి వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ ● వేలాదిగా తరలి వచ్చిన భక్తజనం

బొబ్బిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి స్వీయపర్యవేక్షణలో శుక్రవారం రాత్రి బొబ్బిలి రాజాకళాశాల మైదానంలో శ్రీరామ పాదుకారాధన కన్నుల పండువగా జరిగింది. బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బొబ్బిలి వికాసతరంగణి, ఎమ్మెల్యే బేబీనాయన సంయుక్తంగా ఈ కార్యక్రమం తలపెట్టారు. చినజీయర్ స్వామి స్వయంగా వేదమంత్రోచ్చారణతో భక్తులతో పాదుకారాధన చేయించారు. భక్తులంతా పరవశించిపోయారు. తొలుత చినజీయర్‌స్వామి స్థానిక శ్రీవేణుగోపాలస్వామిని దర్శించుకొని అక్కడి స్వామివారికి బంగారు ఆభరణాల అలంకరణను పునఃప్రారంభించారు. అక్కడ నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా రాజా కళాశాల మైదానానికి తరలివచ్చారు. మహిళల కోలాటం, తప్పిటగుళ్లు, జానపద నృత్యాలతో ఘన స్వాగతం పలికారు.

రక్షించాలని వేడుకుందాం: చినజీయర్‌స్వామి..

వాతావరణంలో చోటుచేసుకుంటున్న పెనుమార్పుల ప్రభావంతో జనజీవనం అతలాకుతల మవుతోందని, ఆ విపత్తుల నుంచి రక్షించాలని భగవంతుడిని వేడుకుందామని చినజీయర్‌స్వామి అన్నారు. 'వాతావరణం చల్లబడాలి. పంటలు సమృద్ధిగా పండాలి. మానవ సంబంధాలు మెరుగుపడాలి. శ్రీరాముని పాదుకలే మనకు శ్రీరామరక్ష. భరతుడు 14 ఏళ్ల శ్రీరామపాదుకలను ఆరాధించుకొని పాలన సాగించడంతో దేశ సంపద పదింతలు వృద్ధి అయింది' అంటూ భక్తులను ఉద్దేశించి రామాయణంలోని వివిధ ఘట్టాలను ఉటంకించారు. భక్తులంతా సంపదలతో తులతూగాలని, పేదలందరికీ సహాయ పడాలని, భక్తులు కాని వారు సన్మార్గంలో పయనించాలని స్వామీజీ కోరారు. లోక కళ్యాణార్థం ఎమ్మెల్యే బేబీనాయన, వికాసతతరంగణి వారు ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఆశీర్వదించారు. ఈ నెల 11 న గీతాజయంతి సందర్భంగా అందరూ భగవద్గీతను ఆలపించాలని హితవు పలికారు. బేబీనాయన మాట్లాడుతూ చినజీయర్‌స్వామి పవిత్రమైన మంగళశాసనాలతో బొబ్బిలి ప్రాంత ప్రజలకు అమూల్యమైన ఆధ్యాత్మిక వరాన్ని ప్రసాదించారన్నారు. ఆయన దివ్యచరణా లతో వేణుగోపాల స్వామికి ఆభరణాలను బ్యాంకు లాకరు నుంచి తెప్పించి పునః అలంకరణ చేసుకోవడం చాలా సంతోషదాయకమన్నారు.

బొబ్బిలి కోటలో తీర్థగోష్టి..

బొబ్బిలి కోట దర్బారు మహల్ ఆవరణలో శుక్రవారం ఉదయం తీర్థగోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో త్రిదండి చినజీయర్‌స్వామి మాట్లాడుతూ బొబ్బిలి పట్టణ ప్రజల ఇలవేల్పు వేణుగోపాలస్వామికి అమూల్యమైన బంగారు, వజ్రవైఢూర్యాలతో పొదిన ఆభరణాల అలంకరణను సుమారు 70 ఏళ్లక్రితం నుంచి నిలుపుదల చేశారన్నారు. రాజవంశీయులైన బేబీనాయన సోదరులు శ్రీవేణుగోపాలస్వామికి పూర్వవైభవం తీసుకురావాలన్న తపనతో బ్యాంకులో ఉన్న ఆభరణాలను రప్పించి అలంకరిస్తున్నార న్నారు. బొబ్బిలి రాజులకు భగవత్ నిష్ఠ ఎక్కువని, వైష్ణవసాంప్రదాయాలను విశేషంగా గౌరవిస్తున్నారని, ఆ భగవంతుని దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ వారిపై కొనసాగుతాయన్నారు. డబ్బు, బంగారం, పదవులు ఏ ఒక్కరికీ శాశ్వతం కాదని, భగవంతుని సేవలో తరించడం ఒక్కటే జీవితానందానికి పరమావధి అని చెప్పారు.



త్రిదండి చినజీయర్‌స్వామికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



ఉత్సాహంగా కళాఉత్సవ్

నెల్లిమర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లాలోని 50 పాఠశాలలకు చెందిన 168 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో కళా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు. ఈ పోటీలలో గాత్ర సంగీతంలో ఎస్.యోజిత (మొయిద), కె.సరస్వతి, జె.లక్ష్మి బృందం(గజపతినగరం), ఆర్.సంజన (చీపురుపల్లి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వాయిద్య సంగీతంలో బి.శివాత్మిక (భాస్కర్ ఐటీఐ, విజయనగరం) ప్రథమ, నృత్యంలో బి.గాయత్రీ బృందం (అంబేద్కర్ గురుకులం, వియ్యంపేట), ఎస్.మెహెర్‌శ్రీ బృందం (మొయిద), ఎస్.అనూరాధ బృందం (గొట్లాం) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారు. నాటకం విభాగంలో పి.సురేంద్ర బృందం (మొయిద), ఎస్.హారిక బృందం (చీపురుపల్లి) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. దృశ్యకళల్లో పి.సౌజన్యమణి (ఎంజేపీ గురుకులం, నెల్లిమర్ల), వాసుపల్లి ఇందు (ఎంజేపీ గురుకులం, నెల్లిమర్ల) ఎ.హిమబిందు (కేజీబీవీ, చీపురుపల్లి) బహుమతులు సాధించారు. సంప్రదాయ కథలు చెప్పడంలో ఎస్.యోగశ్విని, బి.నవ్య (ఎంజేపీ గురుకులం, నెల్లిమర్ల) ప్రథమ బహుమతి సాధించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఎం.ఆదయ్య, వి.నారాయణమూర్తి, ఎ.వి.ఆర్.డి. ప్రసాద్ వ్యవహరించారు. డైట్ లెక్చరర్లు పి.రవికుమార్, కె.సూర్యారావు, ఎల్.రామకృష్ణారావు, డి.ఈశ్వరరావు, వీవీజేఎస్ సుబ్రహ్మణ్యం, ఎ.శ్రీనివాస్, మాత రామకృష్ణ, వి.భారతి తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ప్రిన్సిపాల్ పగడాలమ్మ తదితరులు



నృత్య ప్రదర్శనతో అలరించిన విద్యార్థిని

వారి సేవలు అనిర్వచనీయం

● హోంగార్డుల దినోత్సవంలో ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సేవలు అనిర్వచమని, పోలీస్ శాఖలో వారు వెన్నెముక లాంటి వారని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో హోంగార్డుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోంగార్డులు నిర్వహించిన పరేడ్‌ను ఎస్పీ పర్యవేక్షించారు. అనంతరం వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. 1948లో స్థాపించిన హోంగార్డుల వ్యవస్థ ఒక సాధారణ సర్వీస్‌లా మొదలై.. ఇప్పుడు పోలీస్ శాఖలో కీలకంగా మారిందని ఆయన చెప్పారు. కేసుల దర్యాప్తుల్లోనూ వారి సహకారం మరువలేనిదన్నారు. హోంగార్డుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే నెలకు రెండు రోజుల వేతనంతో కూడిన సెలవులు, మహిళా హోంగార్డులకు మూడు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూరు చేస్తుందన్నారు. కో ఆరేటివ్ క్రెడిట్ ద్వారా ఇచ్చే లోన్‌ను పెంచుతున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏఎస్పీలు దిలీప్‌కిరణ్, అంకిత సురానా, ఆర్మడ్ రిజర్వ్ డీఎస్పీ థామస్ రెడ్డి ఎస్‌బీ సీఐ రంగనాథం, సోషల్ మీడియా సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పరేడ్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

14న నీటి సంఘాల ఎన్నికలు

● రీషెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
● సమాయత్తమవుతున్న అధికారులు

జియ్యమ్మవలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 11న నోటిఫికేషన్ విడుదల కాగా 14వ తేదీకల్లా ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో నీటి పారుదలశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. వాస్తవానికి ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు ఈ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. అయితే రాష్ట్రంలో తుఫాన్ నేపథ్యంలో రద్దు చేసింది. తాజాగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఏర్పాట్లు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.



వట్టిగెడ్డ ప్రాజెక్టు

మరోవైపు గ్రామస్థాయిలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. జిల్లాలోని వీఆర్ఎస్, వట్టిగెడ్డ, పెద్దగెడ్డ, పెదంకలాం, తోటపల్లి, రెండు మైనర్ ఇరిగేషన్ ప్రాక్టుల పరిధిలో 213 సంఘాలు ఉన్నాయి. వాటిల్లో 1560 టెరిటోరియల్ కాన్‌స్టిట్యుయెన్సీ (టీసీ) సభ్యులు ఉన్నారు. 11న నోటిఫికేషన్ జారీ అవ్వగా, 12న సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్నుకుంటారు. 13న డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 14న ప్రాజెక్టు కమిటీలకు నీటి పారుదలశాఖ, కలెక్టర్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు తెలిపారు.

తవ్వి వదిలేస్తారా?

కవులవాడ ప్రభుత్వ పాఠశాల వెనుక ప్రమాదకరంగా ఉన్న గొయ్యి ఇది. సచివాలయ వెల్‌నెస్ సెంటర్ కోసం తవ్వి వదిలేశారు. 8 మీటర్ల వెడల్పు, 18 మీటర్ల పొడవు, 8మీటర్ల లోతున భవన నిర్మాణం కోసం తవ్వారు. ఆ ప్రభావంతో పాఠశాల ప్రహరీ నేలకొరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతిలో నీరు చేరింది. పక్కనే పాఠశాల ఉన్నా కూడా గొయ్యిని అలా నిర్లక్ష్యంగా వదిలేశారు. కనీసం ప్రహరీకి అయినా మరమ్మతులు చేపట్టలేదు. అటు వైపుగా పశువులు, చిన్నారులు ఎవరు వెళ్లినా కాలు జారి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయమై ఎంపీడీవో కిషోర్‌కుమార్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

-భోగాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)



చెరువును తలపిస్తున్న వెల్‌నెస్ సెంటర్ కోసం తవ్వి వదిలేసిన గొయ్యి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సందడి.. సందడిగా

● కేరింతలు కొట్టిన దివ్యాంగులు
● ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ సభ

విజయనగరం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు కేరింతలు కొట్టారు.. డ్యాన్యులు చేశారు.. సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు.. వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. మొత్తంగా రోజంతా సందడి చేశారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి దివ్యాంగులు హాజరయ్యారు. వారిలో వారు చాలా ఆనందంగా గడిపారు. మాట రాని వారు సైగలు చేస్తూ ఒకరి భావాలను ఒకరు పంచుకున్నారు. మానసిక దివ్యాంగులు నాటికను ప్రదర్శించి అందరినీ అబ్బురపరిచారు. సదస్సులో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జీవీడీ జగదీష్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ఉపాధి కల్పించేందుకు రుణాలను మంజూరు చేస్తామన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి తమ శాఖా పరంగా తీసుకుంటున్న కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలన్నారు. మెప్మా పీడీ చిట్టిరాజు మాట్లాడుతూ దివ్యాంగులు వివిధ రంగాల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో నాయకత్వ లక్షణాలు వెలికితీయడం, ఈ ఏడాది విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ థీమ్ అని పేర్కొన్నారు. అనంతరం దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ నెల 3న రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా వివిధ రంగాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులకు, వారికి సహాయం చేసిన వారికి ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి, ఓహెచ్ అసోసియేషన్ నాయకులు లక్ష్మణరావు, అంధ ఉద్యోగుల సంఘం నాయకుడు ఉమాశంకర్ పాల్గొన్నారు.







ఆకట్టుకున్న దివ్యాంగ విద్యార్థుల ప్రదర్శనలు



తరలివస్తున్న దృశ్యం



వైసీపీ ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతాం



ఎస్.కోట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి



డెంకాడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

శృంగవరపుకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేసిన భూ తప్పిదాలను తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం సరిదిద్దుతుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం మరుపల్లిలో రెవెన్యూ సదస్సును ప్రారంభించారు. రైతుల నుంచి వినతులను స్వీకరించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు భూ ఆక్రమణల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జగనన్న రీ సర్వేలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వీటిన్నటిని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం రెవన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. భూ సమస్యలకు 45 రోజుల్లో పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.అరుణ కుమారి, సర్పంచ్ మీనా, మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, నాయకులు ఇందుకూరి శ్రీనిరాజు, సూరి అప్పారావు, సన్యాసిదేముడు తదితరులు పాల్గొన్నారు.

45 రోజుల్లో పరిష్కారం

డెంకాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రతి సమస్యను 45 రోజులలో పరిష్కరించనున్నట్టు ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. గుణుపూరుపేటలో శుక్రవారం తహసీల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఎల్ఏ లోకం నాగమాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. గత 5 సంవత్సరాలలో జరిగిన భూ ఆక్రమాలపై దృష్టి పెట్టి కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ అధికారులు స్పందించి చెరువులు, వాగులు ఆక్రమించి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై తగు చర్యలు చేపట్టాలని కోరారు. తారక రామ తీర్థ సాగర్ కుడి కాలువను యధావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు సుధారాణి, జమదగ్ని, ఎంపీపీ వాసుదేవరావు పాల్గొన్నారు.

వివాదాలకు చెక్

నెల్లిమర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) గ్రామాల్లో భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహద పడతాయని మండల ప్రత్యేక అధికారి, జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కూర్మి నాయుడు అన్నారు. రామతీర్థంలో రెవెన్యూ సదస్సులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గ్రామ సచివాలయం వద్ద జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, సర్పంచ్ కంచరాపు సూర్యకళ, ఎంపీటీసీ తర్లాడ జయమ్మ, నాయకులు కోటపాటి తిరుపతిరావు, తాడ్డి సత్యనారాయణ, జనసేన నాయకులు ఎల్లంకి శ్రీహరి, నవుగట్ల పైడిరాజు, తహసీల్దార్ బి.సుదర్శనరావు పాల్గొన్నారు.

మీరైనా కనికరించండి

భోగాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అనేక పర్యాయాలు వినతులు అందజేశామని, అయినా భూ సమస్యలు పరిష్కారం కాలేదని, ఇప్పుడైనా పరిష్కరించేలా చూడాలని అర్జీదారులు అధికారులకు మొర పెట్టుకున్నారు. కవులవాడలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, డిప్యూటీ సీఈవో ఆర్.వెంకటరామన్, తహసీల్దార్ ఎం.సురేష్, ఎంపీడీవో కిషోర్‌కుమార్, సబ్ రిజిస్ట్రార్ పి.రామకృష్ణ గ్రామంలో పర్యటించారు. ఆర్ఐ ఇమ్రాన్, నాయకులు కొత్తయ్యరెడ్డి, తాతారావు, దాట్ల శ్రీను, సూరప్పారావు వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించండి

చీపురుపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ఉన్న తమ భూ సమస్యను పరిష్కరించాలని ఇటకర్లపల్లి రైతులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జరిగిన సదస్సులో రైతులు తమ సమస్యలను అధికారులకు వివరించారు. తమ సాగులో ఉన్న దాదాపు 200 ఎకరాలు దేవదాయ శాఖ రికార్డుల్లో నమోదై ఉన్నాయన్నారు. ఎన్నిమార్లు అర్జీలు పెట్టుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. సమగ్రంగా సర్వే నిర్వహించి పక్కాగా రికార్డులు తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యవాణి, ప్రత్యేక అధికారి రాజ్యలక్ష్మి, నోడల్ అధికారి హేమసుందర్‌రావు, ఎంపీడీఓ ఎ.సరళ, తహశీల్దారు ఎన్. రాజారావు, ఎంపీటీసీ హైమవతి, సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

సమస్యలు లేని గ్రామాలే లక్ష్యం

వేపాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలు లేని గ్రామాలను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తోందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పాటూరులో శుక్రవారం రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాములమ్మ, సర్పంచ్ కొట్యాడ రామలక్ష్మి, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



భోగాపురం: వినతిపత్రం అందిస్తున్న కర్రోతు బంగార్రాజు తదితరులు



వేపాడ: సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

న్యూస్ బాక్స్

కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కుప్పిలి

రాజాం రూరల్/రాజాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా కుప్పిలి చైతన్య కుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ చీఫ్ వైఎస్ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఈనెల 5న విజయవాడలో చైతన్య కుమార్‌కు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. పార్టీ కండువా వేసి వైఎస్ షర్మిల అభినందించారు. రాజాం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేస్తానని చైతన్య కుమార్ స్పష్టం చేశారు.

46 మంది రక్తదానం

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద విజయ బ్యాంక్‌లో శుక్రవారం నిర్వహించిన శిబిరంలో 46 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తమాస్, సభ్యులు అశోక్, సాయి, శరత్, రఘు, వినయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యకర్తలను కొనసాగించాలి

కొత్తవలస డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పురష ఆరోగ్య కార్యకర్తలను కొనసాగించాలని యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ జేవీవీ ప్రసాదరావు డిమాండ్ చేశారు. వీరందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 15 మంది వరకు పని చేస్తున్నారని చెప్పారు.

కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా అర్జున

గంట్యాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా బుడతనాపల్లి గ్రామానికి చెందిన రంది అర్జున మహేశ్వరరావును నియమించారు. ఆయనను స్థానిక టీడీపీ నాయకులు అభినందించారు. తన ఎంపికకు కృషి చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకు, టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన

లక్కవరపుకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం జరుగనున్న మెగా పేరెంట్స్ సమావేశ ఏర్పాట్లుపై జిల్లా కమ్యూనల్ మానిటరింగ్ అధికారి వి.ఆదినారాయణ పరిశీలించారు. ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాల్లో ఏర్పాట్లను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా రవి

వంగర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శివ్వాం వ్యవసాయ ప్రాథమిక సహకార సొసైటీ అధ్యక్షునిగా బి.రవిని ఎన్నుకున్నారు. శుక్రవారం రాజాంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో రవికి ఎక్కువ మంది మద్దతు లభించటంతో ఆయనను అధ్యక్షులుగా ఎమ్మెల్యే సోదరుడు కోండ్రు జగదీష్ ప్రకటించారు.

ఇన్నోవేషన్ సదస్సులో కోండ్రు

రాజాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని నేషనల్ కాంక్లేవ్ ఆన్ డిప్ టెక్ ఇన్నోవేషన్ సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొన్నారు. అక్కడ వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించం

రాజాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించేది లేదని నోడల్ అధికారి నిర్మల కుమారి హెచ్చరించారు. శుక్రవారం మొగులి వలసలో రూ.6 లక్షలతో చేపడుతున్న రోడ్లు, కాలువ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

గంట్యాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యను పరిష్కరించాలంటూ గ్రామ పంచాయితీ పారిశుధ్య కార్మికులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎం.రమణ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు నాలుగు నుంచి 12 నెలలు వరకూ జీతాలు బకాయిలు ఉన్నాయని ఆరోపించారు. పారిశుధ్య కార్మికుల ఆకలి తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సన్యాసిరావు, పరదేశి, దుర్గరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు అన్న క్యాంటీన్ ప్రారంభం

నెల్లిమర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలో రూ.26 లక్షలతో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను ఈ నెల 8వ తేదీ ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. ఈ భవనాన్ని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, లెంక అప్పలనాయుడు, బయిరెడ్డి కల్యాణ్ చక్రవర్తి, జనసేన నాయకులు శంకరరావు, భానుప్రకాష్, కమిషనర్ కె.అప్పలరాజు, ఇంజినీరింగ్ అధికారి త్రినాథ్ శుక్రవారం పరిశీలించారు.

నిందితులకు వినూత్న శిక్ష

నెల్లిమర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వమ్మి గ్రామంలో పేకాడుతూ పట్టుబడిన నిందితులకు స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ వినూత్న శిక్ష విధించారు. వీరికి రెండు రోజుల పాటు ఆస్పత్రిలో, రెండు రోజుల పాటు పాఠశాలల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టాలని శుక్రవారం తీర్పునిచ్చినట్టు స్థానిక ఎస్ఐ గణేష్ తెలిపారు.

ఆటో చోరీ

భోగాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముంజేరు పంచాయతీ చాట్లపేటకు చెందిన చాట్ల రాంబాబుకు చెందిన ఏపీ35 డబ్ల్యు 7392 నెంబరు గల ఆటో చోరీకి గురైంది. ఈనెల 5న పశువుల ఆసుపత్రి సమీపంలోని గోదాం ఆవరణలో ఆటో నిలిపి ఉంచాడు. అనంతరం సీరియల్ రావడంతో ఆటోను తెచ్చేందుకు వెళ్లాడు. అక్కడ ఆటో లేకపోవడంతో చుట్టూ గాలించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిసింది.

250 మందికి ఉచిత వైద్య సేవలు

వేపాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొండగంగుబూడి గ్రామంలో బాయిరెడ్డి ఫౌండేషన్, ఫినామ్, ఓమ్ని ఆర్కే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 250 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులకూ వైద్య సేవలు అందించారు. నిర్వాహకులను ఎమ్మెల్యే లలితకుమారి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బీవీఆర్ఎస్ వర్మ బీబీఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

42 మందికి ఉద్యోగావకాశాలు

శృంగవరపుకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు 120 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో మొత్తం 42 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి భాస్కరరావు, పి.కళావతి, పద్మ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని టీడీపీ నాయకులు కోండ్రు జగదీష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి నిర్మల కుమారి, మార్కెటింగ్ శాఖ ఏడీ రవికుమార్, వ్యవసాయ శాఖ ఏడీ చంద్రరావు, నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు పాల్గొన్నారు.

రహదారి కష్టాలు తొలగించండి



నాగార్జునకు వినతిపత్రం సమర్పిస్తున్న గరివిడి వాసులు

చీపురుపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గరివిడి ఆర్వోబీ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, పాత రైల్వే గేటు వద్ద ఒక అండర్ పాసేజ్ నిర్మించి, రహదారి కష్టాలను తప్పించాలని అక్కడి వ్యాపారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం చీపురుపల్లిలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆర్వోబీ నిర్మాణం వల్ల గరివిడి పట్టణం రెండుగా విడిపోయిందన్నారు. రైల్వే గేటు దాటాలనుకున్న వారు కనీసం రెండు కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తోందన్నారు. చీపురుపల్లి వైపున ఉన్న వారెవరైనా మరణిస్తే శ్మశాన వాటికకు తరలించడానికి కనీసం రెండు కిలోమీటర్లు దాటాల్సి వస్తుందన్నారు. ఇక్కడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, రైల్వే గేటు వద్ద అండర్ పాసేజ్ ఏర్పాటు చేయాలని వారు నాగార్జునకు విజ్ఞప్తి చేశారు.

జాతీయ పోటీలకు ఎంపిక



విద్యార్థినితో హెచ్ఎం సునీత

కొత్తవలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వారణాసిలో ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకు జరగనున్న అండర్-14 జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు దెందేరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని గొర్లె రేవతి ఎంపికైంది. ఈ మేరకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, దెందేరు హైస్కూల్ పీడీ కె.కృష్ణంరాజు తెలిపారు. ఆ విద్యార్థినిని సర్పంచ్ విరోతి వెంకటరమణ, మాజీ సర్పంచ్ విరోతి శివాజీ, హెచ్ఎం బి.సునీత అభినందించారు.

సమాజాభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం కీలకం



ప్రాజెక్టులను తిలకిస్తున్న స్వామినాయుడు తదితరులు

విజయనగరం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం కీలకపాత్ర పోషిస్తుందని జేఎన్‌టీయూ జీవీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డి) డైరెక్టర్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు అన్నారు. ఫూల్‌బాగ్‌లో ఉన్న ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీటెక్ ఫెస్ట్- 2024ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ జి.స్వామినాయుడు మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని వెలికితీయడానికి ఫెస్ట్‌లు దోహదపడతాయన్నారు. విద్యార్థులు రూపొందించిన 62 ప్రాజెక్టులను తిలకించి, వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, జేఎన్‌టీయూ మెకానికల్ విభాగాధిపతి కె.శ్రీనివాసరావు, సాంకేతిక ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎల్.విజయలక్ష్మి, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవు

రేగిడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంకిలి ఈఐడీ ప్యారీ షుగర్స్, దాని అనుబంధసంస్థలు కాలుష్య ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని రీజనల్ పొల్యూషన్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ సరిత స్పష్టం చేశారు. ల్యాబ్ నివేదికల మేరకు చర్యలు ఉంటాయని తెలిపారు. వీటి కాలుష్య సమస్యలపై అందిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం ఈఈ విచారణ చేపట్టారు. ఔట్ చెరువు, నాయుడు చెరువులను ఫిర్యాదుదారులతో కలసి పరిశీలించారు. ఔట్‌చెరువుకు డిస్టలరీ ప్లాంట్ నుంచి వెళుతున్న వ్యర్థ జలాలను గుర్తించారు. లీక్‌లను నియంత్రించాలని కర్మాగార సిబ్బందిని ఆదేశించారు. అనంతరం చెరువుల్లోని మట్టి, నీటి నమూనాలను సేకరించారు. ఈ తనిఖీలో ఫిర్యాదుదారులు సంకిలి సర్పంచ్ బి.పట్టాభి, ఉపసర్పంచ్ గుండ పకీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

విజయనగరం క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారమవుతాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయి కల్యాణచక్రవర్తి అన్నారు. జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి టి.వి.రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో మధ్యవర్తిత్వంపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ న్యాయవాదులు మధ్యవర్తిత్వంతో కేసులు ఎలా పరిష్కరించాలో వివరించారు.

9న మెగా రిక్రూట్‌మెంట్ డ్రైవ్

చీపురుపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న గరివిడిలో మెగా రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గరివిడిలోని కేఏఆర్ ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు, పైల బలరాం, కుమిలి శ్రీను, సబ్బి సోనియా తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

శృంగవరపుకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు పోడు పట్టాలివ్వాలని ఆ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘ నాయకుడు జె.గౌరీష్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. గిరిజన ఫిల్డ్ అసిస్టెంట్‌లను రెగ్యులర్ చేయడంతో పాటు ఉపాధి పనులు కల్పించాలని కోరారు. మూల బొడ్డవర పంచాయతీని రెండుగా విభజించాలని కోరారు. ఈ మేరకు ఎంపీపీ సండి సోమేశ్వరరావు, ఉప తహసీల్దార్ భరత్ కుమార్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కబడ్డీ జట్టు పయనం

విజయనగరం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 నుంచి 10 వరకు ప్రకాశం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు శుక్రవారం పయనమైంది. ఈ క్రీడాకారులకు కబడ్డీ సంఘం చైర్మన్ ఐవీపీ రాజు, టీడీపీ నాయకులు కర్రోతు నర్సింగరావు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 10 నుంచి 14 వరకు వారణాసిలో నిర్వహించనున్న ఆల్ ఇండియా అండర్- 14 వాలీబాల్ పోటీల్లో పాల్గొనే బాల బాలికల జిల్లా జట్టుకు డీఈవో యు.మాణిక్యాలనాయుడు వాలీబాల్ కిట్లు, క్రీడా దుస్తులను శుక్రవారం తన కార్యాలయం వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో వెంకటరమణ, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, టీవీ భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

ఏయూ హాకీ జట్టుకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమాభారతి డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు చీడి పార్థసారథి, చీడి పవన్ శేఖర్‌లు ఆంధ్రా విశ్వవిద్యాలయం స్థాయి హాకీ జట్టులో చోటు సంపాదించారని కళాశాల కరస్పాండెంట్ బీఏ రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ సీహెచ్ పైడిరాజు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 నుంచి మెగా పేరెంట్స్ డే నిర్వహించి, విద్యాభివృద్ధికి కృషి చేస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, తక్షణమే విజయనగరం జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. సంఘ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ శిల్పారామం వద్ద 20 ఎకరాల స్థలం కేటాయించి మున్సిపల్ పాఠశాలలు నిర్మించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, శ్రీను, రామచంద్రరావు, సుధీర్, పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులకు విఘాతం

విజయనగరం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలుగుతోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని జెడ్పీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో విలవిల

(ఏడో పేజీ తరువాయి)

కట్టాలని, లేకుంటే విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ఎవరైనా ఫోన్ చేస్తే దానిని నమ్మరాదు. సమీప విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లి వివరాలు తెలుసుకోవాలి.

● రిమోట్ డెస్క్ యాప్‌లు చాలావరకు సైబర్ కేటుగాళ్ల చేతుల్లో ఉన్నాయి. అందువల్ల ఎటువంటి అపరిచిత యాప్‌లు డౌన్‌లోడ్ చేయడం మంచిది కాదు.

● ఫేక్ లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలి.

● ఈ-మెయిల్ హ్యాక్ అయ్యింది. వీడియోలు ఉన్నాయని బెదిరింపు కాల్స్ వస్తే వెంటనే డయల్ 100, 1930 112కు సమాచారం ఇవ్వాలి. లేకుంటే సమీప పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలి.

● అపరిచిత నెంబర్ల నుంచి వీడియో కాల్స్ వస్తే.. అవతలి వ్యక్తిని ముందుగా చూడాలి. వాళ్లు మీకు తెలిసిన వారే అని నిర్ధారించుకున్న తరువాత నేరుగా వీడియో కాల్స్ మాట్లాడొచ్చు.

● సీఎం కార్యాలయం నుంచి ఫోన్ వచ్చిందని ఎవరైనా చెబితే.. జిల్లాలో సంబంధిత అధికారిని కలిసి కన్ఫర్మ్ చేసుకుని సలహా తీసుకోండి.

● తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందొచ్చని ఎవరైనా ఫోన్ చేసినా, యాప్స్ లింకులు వచ్చినా పోలీసులకు తెలియజేయాలి.

అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఆన్‌లైన్‌లో వచ్చిన మెసేజ్‌లు , లింకులపై జాగ్రత్తగా ఉండాలి. బెదిరింపు కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. పోలీస్, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని, ఒకే రోజు ఎక్కువ మొత్తంలో నగదు డ్రా చేసే వారిపై నిఘా పెట్టాలని ఇటీవల ఎస్పీ మాధవరెడ్డి వారికి సూచించారు. నేరాలు తగ్గుముఖం పట్టేలా, బాధితులకు న్యాయం చేసేలా మా వంతు కృషి చేస్తున్నాం.

- టీవీ తిరుపతిరావు, సీఐ , చినమేరంగి

ఉద్యోగుల సమస్యలపై సానుకూలం

● మంత్రి సంధ్యారాణి

సీతంపేట రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పొరుగు సేవల ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం సీతంపేట ఏజెన్సీలో పర్యటించిన మంత్రి.. గత 16 రోజులుగా ఐటీడీఏ కార్యాలయ ప్రధాన గేటు వద్ద ఉపాధ్యాయుల చేస్తున్న దీక్షా శిబిరం వద్ద ఆగి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేతనాల పెంపు కోసం ఆర్థిక శాఖకు అనుమతుల నిమిత్తం పంపించామని చెప్పారు. డీఎస్సీలో నియామకాలు చేపట్టినప్పటికీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగిస్తామని ఆమె తెలియజేశారు. అయితే అమలు కాని హామీలను నెరవేర్చలేమని ఆమె స్పష్టంచేశారు. దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ సీఆర్టీలతో సమానంగా తమకు వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రిని కోరారు. మంత్రి వెంట పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గోతులు లేని రహదారులే లక్ష్యం

పార్వతీపురంటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో గల 30 వార్డుల్లో గోతులు లేని రహదారులే లక్ష్యంగా ప్రభుత్వం శ్రద్ధ చూపిందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం 30 వార్డుల్లోని రహదారులపై గోతులు పూడ్చే పనులను ఆయన కొబ్బరి కాయకొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. అందులో భాగంగానే ఆయా వార్డుల్లో గుంతలను పూడ్చుతున్నామని చెప్పారు. అలాగే పట్టణంలోని చారిత్రక కోనేరుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

● వీరఘట్టం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ప్రధాన రహదారి పనులకు టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్ భాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ కృష్ణమూర్తినాయుడు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.లలితకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్త పరీక్షలు చేయాలి



మురుగు కాలువను పరిశీలిస్తున్న జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ

కొమరాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జ్వరంతో బాధపడుతున్న ప్రతి వ్యక్తికీ తప్పకుండా రక్త పరీక్షలు చేయాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం కేఆర్‌బీ పురం పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా వచ్చిన ప్రతి కేసును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి మందులు ఇవ్వాలని ల్యాబ్ టెక్నీషియన్ రవికుమార్‌కు సూచించారు. అనంతరం పెదశాఖ గ్రామాన్ని సందర్శించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అలాగే ఎండభద్ర గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. బడి పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో సిక్ రూం తప్పకుండా ఏర్పాటు చేయాలని హెచ్‌ఎం భూపతిదొరకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బదరీనారాయణ, ఏఎన్‌ఎంలు భారతి, ఝాన్సీరాణి, ఎంఎల్‌హెచ్‌పీలు సుభద్ర, శ్రావణి, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ అవకాశాలపై అవగాహన

పార్వతీపురం/ టౌన్, డిసెంబరు 6: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (సికింద్రాబాద్) ఆధ్వర్యంలో యువతకు అగ్నిపథ్‌లో ఉద్యోగ అవకాశాలకు సంబంధించి ఈనెల 7వ తేదీన పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై 16 నుంచి 21 ఏళ్ల మధ్య ఉన్న యువతీ, యువకులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. అలాగే ఈనెల 8వ తేదీన సాలూరులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో గల అన్ని ఐటీఐ, పాలిటెక్నిక్, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు సబ్సిడీ నగదు పంపిణీ

ఒడిశా

రాయగడ, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదివారం రైతులకు ధాన్యం సబ్సిడీ నగదు అందజేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని బరఘర్ జిల్లా సహాల్‌లో ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో రాయగడ జిల్లాలో కలెక్టర్ పారుల్ పట్వారి ఆదేశాల మేరకు స్థానిక గోవింద చంద్రదేవ్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో అధికారులు అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. క్వింటా ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.2,300తో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.800 కలిపి మొత్తం రూ.3,100 రైతులు అందుకుంటారు. జీసీడీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించవచ్చని అధికారులు తెలిపారు.

9 ఎకరాల్లో గంజాయి పంట ధ్వంసం

రాయగడ, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి పంట లేకుండా చేసేందుకు అబ్కారీశాఖ, పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా గుణుపూర్ సబ్ డివిజన్ పిండగుడ అటవీ ప్రాంతం పరిధిలో శుక్రవారం 9 ఎకరాల్లో సాగవుతున్న 20వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారత రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

● వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు



పార్వతీపురంటౌన్: నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, జేసీ శోభిక, ఐటీడీఏ పీవో శ్రీవాత్సవ్

పార్వతీపురంటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పార్వతీపురంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు, వేసి నివాళి అర్పించారు. జేసీ శోభిక, ఐటీడీఏ పీవో శ్రీవాత్సవ్ తదితరులు పాల్గొన్నారు. ● పాలకొండ: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, ఎంఈవో కె.సోంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. ● నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ● ఏలాం జంక్షన్‌లో ఉన్న విగ్రహానికి దళిత జేఏసీ ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ కమిషనర్ ఎద్దు లిల్లీపుష్పనాథం, జిల్లా దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు బత్తిన మోహన్‌రావు, డివిజన్ అధ్యక్షుడు రవి కుమార్, సీనియర్ దళిత నాయకుడు కొంచాడ జాన్ పాల్గొని నివాళులు అర్పించారు. ● బొబ్బిలి: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఎస్‌బీఐ సెంటరులో గల ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు రాంబార్కి శరత్‌బాబు, పువ్వల శ్రీనివాసరావు తో పాటు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు నివాళులు అర్పించారు. అంబేడ్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, రగ్గులు, చీరలను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు జేసీ రాజు ఆధ్వర్యంలో సీఐ కటకం సతీష్‌కుమార్ తదితరులు నివాళులు అర్పించారు. ● రాజాం/ రాజాం రూరల్: రాజాంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహా నికి టీడీపీ నాయకుడు కోండ్రు జగదీష్ పూలమాల వేసి, నివాళులర్పించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. పాలకొండ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమా ర్ నివాళులర్పించారు. ● గజపతినగరం: ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురు గా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి పూలమాల వేసి నివాళ లర్పించారు. జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.● శృంగవరపు కోట: ధర్మవరం గ్రామంలో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో సర్పంచ్ గాలి సన్యాసయ్య, మాజీ సర్పంచ్ గొర్లె దేముడు, తదితరులు పాల్గొన్నా రు. ● విజయనగరం క్రైం: విజయనగరం బహుజ న సమాజ్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అంబే డ్కర్ వర్ధంతిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్ము సోములు, రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు, జనసేన నేత గురాన అయ్యలు, అవనాపు విక్రమ్, గోసంరక్షణ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ పాల్గొన్నారు.



సాలూరు: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి సంధ్యారాణి

మనందరి దేవుడు..

సాలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'మనందరి దేవుడు డా.బీఆర్ అంబేడ్కర్' అని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఐదో వార్డు(రెల్లివీధి)లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారానే దేశంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేకూరుతుందని అన్నారు. 4, 5 వార్డు ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

బెలగాం/ బలిజిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం నాడే విధి నిర్వహణలో హోంగార్డు గుండె పోటుతో మృతి చెందిన ఘటన పార్వతీపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కలెక్టర్ బంగ్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు బూడి నారాయణస్వామి (46)కి గుండె పోటు రావడంతో అక్కడ సిబ్బంది హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నారాయణస్వామి మృతిచెందాడు. నారాయణస్వామిది బలిజిపేట మండలం పెదపెంకి గ్రామం. ఆయనకు భార్య శారద, ఎనిమిదో తరగతి చదువుతున్న కూతురు రక్షిత ఉన్నారు. ఈయన వారం రోజుల క్రితమే బలిజిపేట పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై పార్వతీపురం వెళ్లారు.

సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులను రప్పించండి

రామభద్రపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించనున్న మెగా పేరెంట్స్‌డే కార్యక్రమానికి తల్లిదండ్రులను తప్పనిసరిగా తీసుకురావాలని బొబ్బిలి డిప్యూటీ డీఈవో మోహనరావు సూచించారు. కొట్టక్కి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కోరారు. హెచ్‌ఎం రావాడ భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● బలిజిపేట: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంఈవో-1 సామల సింహాచలం పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడి వైపు ఒక అడుగు అనే ప్రభుత్వ ఆలోచనతో విద్యాశాఖలో మొట్టమొదటిసారిగా ప్రతి పాఠశాలలో పండగ వాతావరణంలో జరిగే ఈ సమావేశం ఘనంగా నిర్వహించాలన్నారు. ● మక్కువ: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించబోయే మెగా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాట్లు సక్రమంగా జరగాలి ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఉపాధ్యాయుల తో సమీక్షా సమావేశం నిర్వహించారు.

రైతులకు సక్రమంగా సేవలు అందించండి

● కలెక్టర్ శ్యాంప్రసాద్



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

వీరఘట్టం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యు.వెంకంపేట గ్రామంలో ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంస్థను కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. సంస్థ పనితీరును, రైతులకు అందుతున్న సేవలను సిబ్బంది నుంచి అడిగి తెలుసుకున్నారు. రైతులకు స క్రమంగా సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్ సరఫరా లేదని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా విద్యుత్ సరఫరాకు కావాల్సిన ఎస్టిమేషన్ వేసి, పంపించాలని వారికి సూచించారు. భవనం చుట్టూ ఖాళీస్థలాన్ని చదును చేయాలని, రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేలా చూడాలన్నారు. రైతులు తమ ఉత్పత్తులను ఇక్కడ నిల్వ ఉంచి దర వచ్చేటప్పుడు అమ్ముకునే విధంగా దీనిని తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ, ఎంఆర్‌ఐ లక్ష్మణ్‌నాయుడు, ఏపీఎం కె.రాము, ఎఫ్‌పీవోసీసీవై ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశ రక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

సీతంపేట రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. శుక్రవారం సీతంపేట మన్యంలో పర్యటించిన ఆయన.. స్థానిక ఏపీఆర్ గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన అగ్నిపథ్ ఉద్యోగ అవగాహన సదస్సులో పాల్గొని, మాట్లాడారు. గిరిజన విద్యార్థులు దేశ రక్షణ కోసం వచ్చే అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వంటి సంస్థల్లో పరీక్షలు నిర్వహించి ఉన్నత హోదాల్లో నియామకాలు చేపడతామని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఎయిర్‌ఫోర్స్ ప్రతినిధులు లెఫ్టినెంట్ సందీప్, ఝూట్, ప్రత్యేకాధికారి గయాజుద్దీన్, ఏఎంవో కోటిబాబు, ప్రిన్సిపాల్ జి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతో అనర్థాలు

గరుగుబిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మానవ తప్పిదాలతో నేలతల్లికి అనర్థాలు నెలకొంటున్నాయని ప్రకృతి వ్యవసాయ రీజనల్ కోఆర్డినేటర్ కె.ప్రకాష్ అన్నారు. తోటపల్లి జట్టు నూతన కార్యాలయ ప్రాంగణంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ ముగింపునకు ఆయన శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విధానాలను పాటిస్తే రైతులు ఆర్థికంగా లబ్ధి పొందుతారన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ రైతులు అపరాల సాగుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం నవధాన్యాల కిట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు జి.అన్నపూర్ణ, పి.దేవీప్రసాద్, ఆర్.శ్రీనుతో పాటు పలువురు ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఇన్‌చార్జి ఏపీఎంగా శివున్నాయుడు

పాచిపెంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు ఏపీఎంగా శివున్నాయుడు శుక్రవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన జయకుమార్ బదిలీపై మక్కువ మండలం వెళ్లిపోవడంతో 45 రోజులుగా పోస్టు ఖాళీగా ఉంది. పార్వతీపురం మన్యం జిల్లా పీవో ఉత్తర్వుల మేరకు పార్వతీపురం డీఆర్‌డీఏ విభాగంలో బ్యాంకు లింకేజీ ఏపీఎంగా పనిచేస్తున్న శివున్నాయుడును పాచిపెంట వెలుగు ఏపీఎంగా నియమించారు.

కొత్త ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

గరుగుబిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో నూతన గృహాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మండల గృహ నిర్మాణశాఖ జేఈ వంగపండు అఖిల్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గృహాలు నిర్మించుకునే వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0లో మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారులుల తమ ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్సులను సచివాలయాల్లో అందించాలని సూచించారు.

గోశాలల నిర్మాణం వేగవంతం చేయాలి

మక్కువ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోశాల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో డీడీ స్వరూపారాణి అన్నారు. సన్యాసరాజపురంలో నిర్మాణంలో ఉన్న గోశాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. మండలంలోని 8 గోశాలలు మంజూరయ్యాయని, గ్రౌండింగ్ కూడా పూర్తి చేశారని ఆమె తెలిపారు. గోశాల నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది ఎప్పటికప్పుడు నిర్మాణాలను పర్యవేక్షించాలని ఆమె సూచించారు. ఉపాధి హామీ ఏపీవో ఈశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం

వీరఘట్టం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి శుక్రవారం వీరఘట్టంలో సన్మానించారు. పాలకొండ, సీతంపేట కార్యక్రమాల నిమిత్తం వీరఘట్టం మీదుగా వెళ్తున్న ఆమెను మండల నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఉదాయన ఉదయ్‌భాస్కర్, వీరఘట్టం పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, బల్లా హరిబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ పునరుద్ధరణకు చర్యలు

భామిని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్టు పాలకొండ ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన కాంప్లెక్స్ ఆక్రమణలను పరిశీలించారు. ఆక్రమణదారులను కలిసి, ఈనెల 20వ తేదీలోగా ఖాళీ చేయాలని సూచించారు. జనవరిలోగా పరిసరాలు శుభ్రం చేసి, బస్సులు రెస్ట్ షెడ్‌కు వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భూ వివాదాల పరిష్కారానికే..

● ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ సదస్సులు ప్రారంభం

● వినతులు స్వీకరించిన అధికారులు

● పాల్గొన్న ఎమ్మెల్యేలు



గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

సీతానగరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. మండలంలోని రేపటివలస, జానుమునివలస గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. జేసీ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు. ● గుమ్మలక్ష్మీపురం: రైతుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విజ్ఞప్తి చేశారు. మొలిగూడ గ్రామంలో జరిగిన రైతు సదస్సులో ఆమె, పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుల్లో స్వీకరించిన రైతుల సమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తారని చెప్పారు. తహసీల్దార్ శివన్నారాయణ, రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ● జియ్యమ్మవలస: కొండచిలకాం పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎంపీపీ బొంగు సురేష్ పాల్గొన్నారు. కొండచిలకాం నుంచి 10, చినదోడిజ నుంచి 20, ద్రాక్షిణి నుంచి రెండు దరఖాస్తులు అందాయని తహసీల్దార్ ఆర్.పకీరు తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్.గంగరాజు, పార్వతీపురం, పాలకొండ డీఎల్‌పీవోలు కె.నాగభూషణం, జె.రాంప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ● గరుగుబిల్లి : కొత్తపల్లిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్, తహసీల్దార్ పి.బాల పాల్గొని, వినతులు స్వీకరించారు. డీటీ బి.సుందరరావు, ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు. ● వీరఘట్టం: నడుకూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 16 మంది తమ భూ సమస్యలపై వినతులు అందజేశారు. అధికారులు పాల్గొన్నారు. ● భామిని: పాలవలస, మనుమకొండ గ్రామాల్లో తహసీల్దార్ అప్పారావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాలవలసలసలో 31, మనుమకొండలో 14 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే టీటీ రమేష్, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ● సాలూరు రూరల్: అన్నంరాజువలస, మామిడిపల్లి గ్రామాల్లో తహసీల్దార్ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ● సీతంపేట రూరల్: మండలంలోని వజ్జాయిగూడ, సార, తాలాడ గ్రామాల్లో తహసీల్దార్ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో రెవెన్యు సదస్సులు నిర్వహించారు. మొత్తం 91 వినతులను స్వీకరించారు. మరో బృందం హడ్డుబంగి గ్రామంలో నిర్వహించిన సదస్సులో 6 ఫిర్యాదులు స్వీకరించారు. ● బొబ్బిలి రూరల్: రైతులు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని ఆర్డీవో జీవీఎస్ఎస్ రామ్మోహన్‌రావు కోరారు. శుక్రవారం చింతాడ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ ఎం.శ్రీను తదితురులు పాల్గొన్నారు. ● తెర్లాం: మండలంలోని కాగాం, అరసబలగ గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సదస్సులో ప్రత్యేకాధికారి, వ్యవసాయ శాఖ జేడీ రామారావు పాల్గొన్నారు. తహసీల్దార్ హేమంత్‌కూమార్, తదితరులు పాల్గొన్నారు. ● రామభద్రపురం: జన్నివలస గ్రామంలో నిర్వహించిన గ్రామ సదస్సులో బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు పాల్గొన్నారు. ఎస్ఎస్‌వో నూకరాజు, మండల ప్రత్యేకాధికారి ప్రశాంత్ కుమార్, తహసీల్దార్ ఆకుల సులోచనారాణి పాల్గొన్నారు. ● బాడంగి: పూడివలస గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు తమ రెవెన్యూ సమస్యలను సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ సుధాకర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బిందు, తుంపర సేద్యం పరికరాలకు రాయితీ

● మైక్రో ఇరిగేషన్ అధికారి రాధాకృష్ణ

పాచిపెంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర సేద్యానికి సంబంధించిన పరికరాల మంజూరుకు ప్రభుత్వం రాయితీ అవకాశం కల్పించిందని మైక్రో ఇరిగేషన్ అధికారి వి.రాధాకృష్ణ తెలిపారు. కర్రివలస గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. డ్రిప్‌కు సంబంధించి ఐదు ఎకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు యూనిట్ ఖరీదు రూ.25వేల నుంచి రూ.30 వేలు ఉన్న వాటికి ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇస్తుందన్నారు. అలాగే 5 నుంచి 12.5 ఎకరాలు ఉన్న పెద్ద రైతులకు 50 శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. ఇదే విధంగా స్పింక్లర్లకు సంబంధించి చిన్న, సన్నకారు రైతులకు గాను ఐదు ఎకరాల్లోపు గల వారికి 55 శాతం సబ్సిడీ, అలాగే ఐదు ఎకరాలు పైబడిన వారికి 45 శాతం రాయితీ ఇస్తుందన్నారు. జిల్లాలో అధిక శాతం పామాయిల్ సుమారు 16వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉందన్నారు. 1800 హెక్టార్ల సాగు లక్ష్యం కాగా ఇప్పటికే 2,700 మంది బిందు, తుంపర సాగు కోసం దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. అలాగే 410 హెక్టార్లకు గాను రాయితీపై పరికరాలు మంజూరు చేసినట్టు ఆయన వివరించారు. జిల్లాలో జీడి, మామిడి, అరటి, పామాయిల్, కూరగాయలు, తదితర పంటలు సాగులో ఉన్నాయని తెలిపారు.

బకాయిలు చెల్లించండి

● గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన

బాడంగి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బకాయి జీతాలను వెంటనే చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్లు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ కార్యదర్శి ఎ.సురేష్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు